RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం


తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | సోమవారం 8-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 252 పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

## భూ రికార్డుల భద్రతకు దేశంలోనే తొలిసారిగా

# బ్లాక్‌చైన్ టెక్నాలజీ వినియోగం



- పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో సీఎం చంద్రబాబు పర్యటన
- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ
- గడిచిన 6 నెలల్లో 26.46 లక్షల పాస్‌పుస్తకాలు అందజేసిన ప్రభుత్వం
- రైతులతో భేటీ అనంతరం పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించనున్న సీఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆచంట నియోజకవర్గంలోని సిద్ధాంతం గ్రామంలో జరిగే ఈ సభలో రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను ముఖ్యమంత్రి స్వయంగా అందజేస్తారు. అనంతరం రైతులతో

# అభివృద్ధికి కలసిరండి

## హైదరాబాద్ అంతర్జాతీయ నగరమని చెప్పుకుంటే సరిపోతుందా?

### ఆ మేరకు అభివృద్ధి జరగాలి.. మూసీలో మురికి వల్లే ఈ భూములకు విలువ లేదు

### కొడంగల్‌లో ఓడిపోయాక, మల్కాజిగిరిలో ఆశీర్వదించి ఎంపీగా గెలిపించారు

### కిషన్‌రెడ్డి గారూ అనుమతులు తెండి.. గండపెండేరం తొడుగుతామని వెల్లడి



హైదరాబాద్: 'మల్కాజిగిరి ఎంపీగా గెలిపించినప్పుడు వేరే ప్రభుత్వం ఉన్నందున మీరు ఆశించిన అభివృద్ధి చేయలేకపోయాను. కానీ ఇప్పుడు సీఎంగా ఉన్నా. రాజకీయాలకతీతంగా ఎన్ని నిధులైనా, ఎన్ని అనుమతులైనా ఇచ్చే బాధ్యత నాది. రోడ్లు, తాగునీరు, చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ, మెట్రో విస్తరణ తదితరమైనవి ఏవి కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నా. అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులకు సూచిస్తున్నా. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేద్దాం. కావాల్సినవి అడిగి సాధించుకోండి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌లో ఓడిపోయాక,

- మిగతా 2వ పేజీలో

## రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్



2లో

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజం
- మీకు హిట్లరే స్ఫూర్తి అంటూ ఎద్దేవా
- మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా అని విమర్శ
- తమ పాలన అంబేద్కర్, గాంధీ ఆశయాలకు అనుగుణమని వెల్లడి
- బెంగళూరులో రేవంత్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా పోస్ట్

## రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుంది: కిషన్ రెడ్డి

- రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ బాటలోనే పయనిస్తున్నారని విమర్శలు
- కేసీఆర్‌ను ప్రజలు ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని వ్యాఖ్య
- విదేశీ వ్యామోహంతో ప్రజల సమస్యలు మరచిన రేవంత్‌కు అదే గతి తప్పదన్న కిషన్ రెడ్డి
- తెలంగాణలో పాలన మారినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని విమర్శ




2లో

## గోదావరి-కావేరి లింక్‌పై రేవంత్ సర్కార్ జలద్రోహం

### పాలమూరు ప్రాజెక్టుకు ఎన్‌ఓసీ పేరుతో రాష్ట్ర జల హక్కులను తాకట్టు పెడుతున్నారు

### అవసరమైతే ఢిల్లీలో ధర్నాలు, అఖిలపక్ష పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధం: హరీశ్‌రావు



హైదరాబాద్: గోదావరి--నల్లమల సాగర్ ప్రాజెక్టును పాలమూరు ప్రాజెక్టుతో ముడిపెట్టడం తెలంగాణ జలహక్కులను కాలరాయడమేనని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు అన్నారు. సమాధానం చెప్పలేని పరిస్థితుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, తెలంగాణ హక్కుల కోసం ముందుండి



## ఏపీలో రేర్ ఎర్త్ హబ్..

- మాస్కోలో రష్యా రేర్ ఎర్త్ సంస్థ 'గిరెడ్‌మెట్'తో మంత్రి నారా లోకేష్ భేటీ
- ఉత్తరాంధ్రలో రేర్ ఎర్త్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదన
- నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ల తయారీ కేంద్రంపై చర్చలు
- భారత ఈవీ, పవన విద్యుత్ మార్కెట్లే లక్ష్యంగా ప్రాజెక్టులు
- మాస్కోలోని అణుశక్తి మ్యూజియాన్ని సందర్శించిన లోకేష్

### పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం..

## ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కమిటీ రద్దు

- నాయకుల మధ్య విభేదాలు, క్రమశిక్షణ లోపించడమే కారణం
- ఈ మేరకు నిర్ణయం తీసుకున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్
- ప్రకాశం జిల్లా తర్వాత నెల్లూరు కమిటీపై వేటు
- కొత్త కమిటీ నియామకం వరకు కేంద్ర కార్యాలయం పర్యవేక్షణ



2లో

## తప్పుడు ప్రచారాలు మానండి..

- రైతులకు ఉచిత కరెంట్ ఆగదు
- తప్పుడు ప్రచారాలపై భట్టి ఫైర్
- రైతులకు ఉచిత కరెంట్ కొనసాగింపు
- విద్యుత్ సిబ్బందికి రూ. కోటి బీమా
- 20 రోజుల్లో సమస్యల పరిష్కారం

2లో



# మా పోరాటం ఆగదు

- ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి దిగిపోవాల్సిందే
- విద్యా వ్యవస్థలో సమూల మార్పు కోసం ఎజెండా రూపొందిస్తాం
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వెల్లడి

ఛత్రపతి శంభాజీనగర్: జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో అవకతవకల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాల్సిన బాధ్యత ప్రధాని నరేంద్ర మోదీపై ఉందని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే తేల్చిచెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి తప్పుకొనేదాకా తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు. ఆదివారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో అభిజిత్ దీప్కే మీడియాతో మాట్లాడారు. దేశంలో గత 12 ఏళ్లుగా రాజకీయాలు కేవలం హిందూ--ముస్లిం ఎజెండా చుట్టూ తిరుగుతున్నాయని ఆక్షేపించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు ఇప్పటికైనా మారాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత దేశంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పు కోసం ఎజెండాను రూపొందిస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఛత్రపతి శంభాజీనగర్‌లోని



# మా పోరాటం ఆగదు

(మొదటి పేజీ తరువాయి)

సొంత ఇంటికి చేరుకున్న అభిజిత్ దీప్కేకు ఘన స్వాగతం లభించింది. కుటుంబ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపగలిగే శక్తి ఉన్న ప్రధాని మోదీ మన దేశంలో పేపర్ లీక్‌ను ఆపలేరా అని దీప్కే ప్రశ్నించారు. జెన్ జెడ్ యువత ఎవరికీ భయపడబోరన్న సంగతి శనివారం నాటి జంతర్‌మంతర్ ధర్నాతో తెలిసిపోయిందన్నారు. తప్పులు జరిగితే యువత ప్రశ్నిస్తూనే ఉంటుందని ఉద్ఘాటించారు. ఈ ధర్నాకు 7,000 మంది హాజరయ్యారని, తమ ఉద్యమం ఇక దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని స్పష్టంచేశారు. త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. నీట్--యూజీ పేపర్ లీక్ వల్ల లక్షల మంది నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎవరూ బాధ్యత తీసుకోకపోతే వ్యవస్థ సక్రమంగా ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. దీప్కే ఇంటి వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

**ఇది ట్రైలర్ మాత్రమే**

జంతర్‌మంతర్ ధర్నా ఒక ట్రైలర్ మాత్రమేనని అభిజిత్ దీప్కే వ్యాఖ్యానించారు. ధర్నాకు హాజరైనవారికి ఆదివారం 'ఎక్స్'లో కృతజ్ఞతలు తెలియజేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను 7 రోజుల్లోగా పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే మహా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. శనివారం జరిగిన ధర్నాకు చరిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. విద్యా వ్యవస్థకు సంబంధించిన సమస్యలపై విద్యార్థులు, యువతలో పెరుగుతున్న ఆగ్రహాన్ని ఈ ధర్నా ఒక ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ శాంతియుత నిరసన కార్యక్రమం ప్రభుత్వానికి ఒక ట్రైలర్‌ను చూపించిందని వివరించారు. ప్రజలంతా కలిసికట్టుగా గళాన్ని వినిపించకపోతే వ్యవస్థలో ఆశించిన మార్పు రాదని తేల్చిచెప్పారు.

# ఏపీలో రేర్ ఎర్త్ హబ్..

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశంలో పాల్గొన్నారు. రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ ఖనిజాల సంస్థ 'గిరెడ్‌మెట్ ఇనిస్టిట్యూట్' ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో లభించే భారీ ఖనిజ వనరులను ఉపయోగించుకుని, ఒక డీప్ ప్రాసెసింగ్, రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్‌ఈఈ) రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు. అలాగే, భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), పవన విద్యుత్ మార్కెట్ల అవసరాలను తీర్చేందుకు గిరెడ్‌మెట్ సాంకేతికతతో నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పేందుకు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న భారీ ఖనిజ వనరులను ఆధారంగా డీప్ ప్రాసెసింగ్ ఉ రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్‌ఈఈ) రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు, నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు భాగస్వామ్యం వహించాలని కోరాను" అని తెలిపారు. మాస్కోలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియాన్ని కూడా లోకేష్ సందర్శించారు. ఈ పర్యటన తనకు ఒక ప్రత్యేక అనుభూతినిచ్చిందని, విజ్ఞానం, చరిత్ర, సాంకేతికతల సమన్వయ వేదికగా ఈ మ్యూజియం నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

## పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం..

# ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కమిటీ రద్దు

జనసేన పార్టీలో ప్రక్షాళన దిశగా అధినేత పవన్ కల్యాణ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా, నగర, మండల, గ్రామ స్థాయి కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. నెల్లూరు జిల్లాలో నాయకుల మధ్య తీవ్రమైన విభేదాలు, క్రమశిక్షణారాహిత్యం పెరిగిపోయిందని పార్టీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. నాయకులు పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, వారి వైఖరి వల్ల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జన సైనికులు, పార్టీ మద్దతుదారుల నుంచి ఫిర్యాదులు అందాయని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. "క్రమశిక్షణ లేని చోట వ్యవస్థను సక్రమంగా నిర్వహించలేం. అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది" అని పవన్ వివరించారు. కొద్ది రోజుల క్రితమే ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని కూడా ఇదే కారణాలతో రద్దు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అదే తరహా చర్యను ఇప్పుడు నెల్లూరు జిల్లా విషయంలోనూ తీసుకున్నట్లు తెలిపారు. నిర్ణయంతో జిల్లా సమన్వయ బాధ్యతలు చూస్తున్న వారితో సహా కమిటీల్లోని సభ్యులందరూ తమ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లయింది. కొత్త కమిటీని నియమించేంత వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ వ్యవహారాలను కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షిస్తామని జనసేన స్పష్టం చేసింది.

# కాశ్ రాజ్ కు రామ్ గోపాల్ వర్మ మద్దతు

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు, నటుడు ప్రకాశ్ రాజ్ మధ్య సోషల్ మీడియాలో జరుగుతున్న మాటల యుద్ధంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ జోక్యం చేసుకున్నారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను అనుమానించకుండా, నోరు మూసుకుని అనుసరించాలంటూ పార్టీ శ్రేణులకు నాగబాబు పిలుపునిచ్చారు. నాగబాబు వ్యాఖ్యలను నటుడు ప్రకాశ్ రాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. "మేం గొర్రెలం కాదు. బానిస బతుకులు బతకడానికి ఇక్కడ లేము. ఇలాంటి బెదిరింపులు ఆమోదయోగ్యం కాదు," అని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు. ప్రజాస్వామ్యంలో నాయకులు ప్రజల ప్రశ్నలకు తప్పక సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, ప్రకాశ్ రాజ్ వాదనకు రామ్ గోపాల్ వర్మ మద్దతు పలికారు. "ప్రజాస్వామ్యంలో ఒక నాయకుడికి ప్రజలు నమ్మకంతో బాధ్యతలు అప్పగిస్తారు. అంతేగానీ రాజుగా కిరీటం పెట్టరు" అంటూ సంచలనచేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

# అభివృద్ధికి కలసిరండి

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలిన సమయంలో మల్కాజిగిరిలో ఆశీర్వదించి ఎంపీగా గెలిపించారన్నారు. అక్కడి నుంచే సీఎం వరకు రాగలిగానన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేసేందుకు రాజకీయాల కతీతంగా సహకరించాలని కోరారు. శనివారం ఉప్పల్ భగాయత్ లేఔట్ ఫేజ్--3లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనం, టీకేఆర్ జంక్షన్ ఫ్లైఓవర్, ఏఓసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారులు, వంద పడకల ఆస్పత్రి పనులకు శంకుస్థాపనల శిలాఫలకాలను రేవంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. రాజకీయ స్వార్థం, ఎన్నికల లబ్ధి కోసం మూడు కార్పొరేషన్లు చేశానని కొందరంటున్నారు కానీ, పరిపాలన సౌలభ్యం, అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం చేశానని తెలిపారు. క్యూర్ పరిధిలోని 2,100 చదరపు కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న 1.34 కోట్లమంది ప్రజల సదుపాయాల కోసం జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ కార్పొరేషన్లుగా, అదే మాదిరిగా పోలీసు వ్యవస్థను వికేంద్రీకరించినట్లు చెప్పారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌ను పదెకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిచుకుంటున్నామని, రూ. 1,511 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు.

**కనీస కనికరం ఉండొద్దా?**

'గుజరాత్ అహ్మదాబాద్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్, ఢిల్లీలో యమునానది, యూపీలో గంగానది రివర్‌ఫ్రంట్‌ను మీరు అభివృద్ధి చేసుకోవచ్చు కానీ.. మనం మూసీనది ప్రక్షాళన చేయొద్దా? అని అడ్డంపడుతున్న వారిని అడుగుతున్నా' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు, 55 కి.మీ. ప్రక్షాళన చేసి మూసీని అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి చేసి తీరతానన్నారు. 'న్యూయార్క్, న్యూజెర్సీ మధ్యనున్న రివర్‌ఫ్రంట్ దగ్గర ఒక్కో అపార్ట్‌మెంట్ వందల కోట్ల విలువ ఉంది. ఇక్కడ మురికి వల్లే ఈ భూములకు విలువ లేదు. ఇక్కడ ప్రజలు నివసించడం లేదు. నల్లగొండ ప్రజలను కాలుష్యం కాటేస్తుంటే కనికరం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా' అని చెప్పారు. ఆలేరు, భువనగిరి, ప్రాంతాల్లోని ప్రజలు కొత్తగా పెళ్లయిన వారికి గర్భధారణ సమస్యలొస్తాయని, కలుషిత నీరు, ఆహారంతో కడుపుకోతకు గురవుతారని పట్టణానికి పంపిస్తున్నారన్నారు. ఫ్లోరైడ్, మూసీ కాలుష్యం, చచ్చిన శవాల కళేబరాలు కొట్టుకువస్తుంటే, అక్కడి ప్రజలు ప్రక్షాళన చేయాలని కోరారని చెప్పారు. నాగోల్ నుంచి నేరుగా శంషాబాద్ విమానాశ్రయం వెళ్లేందుకు నాగోల్ జంక్షన్-- ఎల్‌బీనగర్ --ఒవైసీ హాస్పిటల్--చాంద్రాయణగుట్ట--రాజేంద్రనగర్--ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో విస్తరణ చేయాల్సిందేనన్నారు. అంతేకాదు, ఎల్‌బీనగర్ -- హయత్‌నగర్ వరకు కూడా చేయాలన్నారు. మెట్రోను 122 కి.మీ.వరకు పొడిగించాల్సి ఉందన్నారు. అంతర్జాతీయనగరం చేయాలని తాను ప్రయత్నిస్తుంటే, అన్ని అనుమతులొచ్చాక , ఇక్కడి నుంచి మంత్రిగా చేస్తున్నాయన పోయి పుల్లలు పెట్టి అర్ధంతరంగా ఆపారని ఆరోపించారు. ఓఆర్ఆర్ వచ్చినందుకు అంతర్జాతీయ నగరంగా మారిందని.. రీజినల్ రింగ్‌రోడ్ వస్తే 360 కిలోమీటర్ల అభివృద్ధి జరిగితే, ప్రపంచంలోనే పోటీపడే సింగపూర్, టోక్యో, న్యూయార్క్‌లాంటి నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతుందన్నారు. అంతర్జాతీయ నగరమని చెప్పుకుంటే సరిపోదని, ఆమేరకు అభివృద్ధి జరగాలన్నారు. జెడ్పీటీసీ నుంచి తాను ఈ స్థాయికి ఎదగడానికి ఆడబిడ్డలే కారణమని, తన ప్రతిసభలో వారికి ముందు కూర్చునే అవకాశం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యూర్--1 యాప్‌ను సీఎం ప్రారంభించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డిపేరు పెట్టామని, చౌరస్తాలో విగ్రహం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. 'హైదరాబాద్‌కు రెండో దశ మెట్రో రావాల్సిందే. ట్రిపుల్ ఆర్‌కు అనుమతులివ్వాల్సిందే. మూసీ ప్రక్షాళన జరగాల్సిందే. రాష్ట్రంలో పండించిన పంటలను మొత్తం కొనాల్సిందే.

# తప్పుడు ప్రచారాలు మానండి..

ప్రతిపక్షాలు అధికార కాంగ్రెస్ పార్టీ , ప్రభుత్వంపై కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం) మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఖమ్మంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలకు ఒక బహిరంగ సవాలు విసిరారు. ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తూ, అబద్ధపు ప్రచారాలతో ఇంకా ఎన్ని సంవత్సరాలు రాజకీయ పబ్బం గడుపుకుంటారని ఆయన నిలదీశారు. తాము చేస్తున్నవన్నీ తప్పుడు ప్రచారాలేనని ఒప్పుకుంటూ రాష్ట్ర ప్రజలకు ప్రతిపక్షాలు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు తప్పుడు సమాచారం ఇస్తూ వారిని మోసం చేయవద్దని భట్టి విక్రమార్క ప్రతిపక్షాలను హెచ్చరించారు. తమ ప్రభుత్వం అత్యంత నిబద్ధతతో పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి నిరంతరం ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, భవిష్యత్తులో కూడా దీనిని ఇలాగే కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు కేవలం కరెంట్ ఇవ్వడమే కాకుండా, ఎంతో జాగ్రత్తలు తీసుకుంటూ అత్యంత నాణ్యమైన విద్యుత్‌ను (క్వాలిటీ పవర్) సరఫరా చేస్తున్నామని, రాబోయే రోజుల్లో కూడా ఈ నాణ్యతలో ఎలాంటి లోటు రానివ్వమని భరోసా ఇచ్చారు. తాము మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని చెప్తూ మాయమాటలు చెప్పే అలవాటు తమకు లేదన్నారు.

# గోదావరి–కావేరి లింక్‌పై రేవంత్ సర్కార్ జలద్రోహం

పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోదావరి--బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. జీడబ్ల్యూడీటీ (గోదావరి జలాల వివాదాల ట్రిబ్యునల్) అవార్డు ప్రకారం గోదావరి నీటిని కృష్ణా పరీవాహక ప్రాంతానికి మళ్లిస్తే తెలంగాణకు 45 టీఎంసీల అదనపు హక్కు ఉంటుందని తాము ముందుగానే హెచ్చరించామన్నారు. నదుల అనుసంధానంపై జరిగిన ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల ప్రాజెక్టులకు పూర్తి అనుమతులు వచి?చన తర్వాతే తదుపరి చర్చలు జరగాలని పట్టుబట్టామని వెల్లడించారు. అనుసంధానంలో తరలించే నీటిలో 50 శాతం తెలంగాణకు ఇవ్వాలని, ఇచ్చంపల్లి లేదా సమ్మక్కసాగర్ నుంచి నాగార్జునసాగర్‌కు లింక్ ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు. ప్రస్తుతం పోలవరం నుంచి నల్లమలసాగర్, అక్కడి నుంచి కావేరికి నీటిని తరలించే ప్రతిపాదనలో తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టుకు కేటాయించిన 90 టీఎంసీలను ఎన్‌ఓసీతో ముడిపెట్టడం ప్రమాదకరమని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణకు ట్రిబ్యునల్ ద్వారా రావాల్సిన 1,005 టీఎంసీలతోపాటు మరో 45 టీఎంసీల అంశం పెండింగ్‌లో ఉండగా రాష్ట్ర ప్రయోజనాలను ప్రభుత్వం వదులుకుంటోందని ఆరోపించారు.

# రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి అని, ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "మీ స్ఫూర్తి హిట్లర్! మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా! మీరు నియంతలను పూజిస్తూ, కూల్చివేతల గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు" అని కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా విమర్శించారు. "మేం మీ అంత తెలివైన వాళ్లం కాదు రేవంత్! అందుకే మేం అంబేద్కర్ రాజ్యాంగం, గాంధీజీ దార్శనికత, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పాలించాం" అని పేర్కొన్నారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైడ్రా పేరు వెనుక తనకు స్ఫూర్తి హిట్లర్ అని వెల్లడించారు. హిట్లర్ కు హైడ్రా అనే టీమ్ ఉండేదని, హిట్లర్ ప్రత్యర్థుల పనిబట్టడమే ఆ టీమ్ పని అని పేర్కొన్నారు. రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది.

## రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుంది: కిషన్ రెడ్డి



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పట్టిన గతే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి కూడా పడుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అబద్ధపు హామీలు, అసమర్థ పాలనతో ప్రజాగ్రహానికి గురై ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో నడుస్తూ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారం మారినా ప్రజల ఆకాంక్షలు మాత్రం నెరవేరడం లేదని విమర్శించారు. అడ్డగోలు హామీలు, నమ్మకద్రోహంతో క్షేత్రస్థాయి సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. సొంత దేశంలో జరుగుతున్న అభివృద్ధిపై విమర్శలు చేస్తూ, విదేశాలపై వ్యామోహం చూపించడం ఇద్దరు ముఖ్యమంత్రుల్లోనూ చూశామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా విదేశీ భాషలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కూడా కేసీఆర్ కు పట్టిన గతే పడుతుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు. చేతగాని పాలన అందిస్తున్న నేతల గ్రాఫ్ పాతాళానికి పడిపోవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.

### భూ రికార్డుల భద్రతకు దేశంలోనే తొలిసారిగా


# బ్లాక్‌చైన్ టెక్నాలజీ వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా సమావేశమై వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకుంటారు.గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన పాస్‌పుస్తకాల్లోని తప్పులను సరిదిద్ది, పారదర్శకమైన రీతిలో కొత్త పాస్‌పుస్తకాలను అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రైతుల సమక్షంలోనే భూములను రీ-సర్వే చేసి, వారి ఆమోదం తర్వాతే తుది రికార్డులను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతీ నెలా ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా రైతులతో సమావేశమై, వారి సమక్షంలోనే అధికారులతో భూ వివరాలను చదివించి పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు.

**6 నెలల్లో 26.46 లక్షల పాస్‌పుస్తకాల పంపిణీ**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, జనవరి నుంచి రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 6,688 గ్రామాల్లో రీ-సర్వే



పూర్తి కాగా, అందులో 6,459 గ్రామాలకు చెందిన 26.46 లక్షల మంది రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను ప్రభుత్వం అందించింది. రానున్న 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి, 67.32 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. దదేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్లాక్‌చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తోంది. దీని ద్వారా ప్రతీ భూ యూనిట్‌కు ఒక శాశ్వత బ్లాక్‌చైన్ ఐడీ కేటాయిస్తున్నారు. తద్వారా రికార్డులను తారుమారు చేయడం అసాధ్యం. సర్వే నుంచి తుది రికార్డు వరకు ప్రతి దశలోనూ రైతు ఈ-కేవైసీని తప్పనిసరి చేశారు.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

సోమవారం ఉదయం 10:25 గంటలకు అమరావతి నుంచి బయలుదేరనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, 11 గంటలకు సిద్ధాంతం గ్రామానికి చేరుకుంటారు. 11:15 గంటలకు 'మీ భూమి-మీ హక్కు' ప్రజా వేదిక సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2:30 గంటలకు రైతులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. అనంతరం 3:15 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 5:35 గంటలకు తిరిగి అమరావతికి చేరుకుంటారు.

# మందమర్రి వద్ద బోల్తాపడ్డ టీజీఎస్ఆర్టీసీ బస్సు..

- తప్పిన పెను ప్రమాదం
- డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పిన వాహనం
- ప్రమాద సమయంలో బస్సులో ఒక్కరే ప్రయాణికుడు
- ఈ ఘటనలో డ్రైవర్, ప్రయాణికుడికి స్వల్ప గాయాలు
- ప్రయాణికులు ముందే దిగిపోవడంతో తప్పిన పెను ప్రమాదం

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ సమీపంలో ఆదివారం ఉదయం టీజీఎస్ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు ఒక ప్రయాణికుడికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తగూడెం నుంచి బెల్లంపల్లికి వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు మందమర్రి సమీపానికి రాగానే, డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో బస్సు అదుపుతప్పి జాతీయ రహదారి నుంచి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డుపైకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్‌తో పాటు కేవలం ఒకే ఒక్క ప్రయాణికుడు ఉన్నట్లు సమాచారం. మిగతా ప్రయాణికులందరూ అప్పటికే తమ గమ్యస్థానాల్లో దిగిపోవడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన డ్రైవర్, ప్రయాణికుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బస్సును అక్కడి నుంచి తొలగించారు. డ్రైవర్ అలసటే ఈ ప్రమాదానికి ప్రాథమిక కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

## రాయలసీమలోకి ప్రవేశించిన రుతుపవనాలు

**సాధారణం కంటే తక్కువ వర్షపాతం**

**విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్**

అమరావతి: రాయలసీమలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రానున్న 2 నుంచి 3 రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ప్రఖర్ జైన్ ఈరోజు(శనివారం) ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక వాతావరణ మార్పులతో కొంత మేర వర్షలోటు భర్తీ అయ్యే సూచనలు ఉన్నాయని తెలిపారు. రుతుపవనాల గమనంలో తరచూ విరామాలు ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. రైతులు పంట ప్రణాళికల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలవరం, గోదావరి జిల్లాలు, రాయలసీమలో తక్కువ వర్షపాతం అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వివరించారు. ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అధిక వర్షపాతం సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. రేపు, ఎల్లుండి రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని హెచ్చరించారు. పల్నాడు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపారు. 58 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 104 మండలాల్లో వడగాడ్పులు ఉన్నాయని హెచ్చరించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వడగాడ్పుల ప్రభావం అధికంగా ఉందని వెల్లడించారు. పలు జిల్లాల్లో 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ చెప్పుకొచ్చారు. కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు. మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని అన్నారు. ప్రజలు ఎండల తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉరుములు, పిడుగుల సమయంలో చెట్ల కింద నిలబడొద్దని హెచ్చరించారు. రైతులు, పశుకాపరులు మేఘావృత వాతావరణంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండలో బయటకు వెళ్లేవారు నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలని తెలిపారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

## గుట్టుచప్పుడు కాకుండా కోడిపందాలు

**ఎస్ఓటి పోలీసుల మెరుపు దాడి**

హైదరాబాద్: శంషాబాద్ మండలంలోని బురుజుగడ్డ తండాలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కోడిపందాల స్థావరంపై ఎస్ఓటీ పోలీసులు ఒక్కసారిగా మెరుపు దాడి చేశారు. బుర్జుగడ్డ తండా శివారు ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా, రహస్యంగా ఈ కోడిపందాలను నిర్వహిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు, పందాల స్థావరాన్ని చుట్టుముట్టి అక్రమంగా సాగుతున్న ఈ వ్యవహారాన్ని రట్టు చేశారు. ఈ దాడిలో కోడిపందాలు కాస్తూ, జూదానికి పాల్పడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను పోలీసులు సంఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆ ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ఘటనాస్థలం నుంచి భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. పందాల కోసం సిద్ధం చేసిన రూ. 3,82,000 నగదుతో పాటు, పందాలకు ఉపయోగిస్తున్న కోళ్లను మరియు నిందితులు అక్కడికి చేరుకోవడానికి ఉపయోగించిన వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అయితే, ఈ కోడిపందాల నిర్వహణను వెనకుండి నడిపిస్తూ, అంతా తానై పర్యవేక్షిస్తున్న ప్రధాన నిర్వాహకుడు మాత్రం పోలీసులు రాకను గమనించి అక్కడి నుంచి చాకచక్యంగా తప్పించుకున్నాడు. ప్రస్తుతం పరారీలో ఉన్న ఆ ప్రధాన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సాగే ఇలాంటి అక్రమ జూద కార్యకలాపాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ వదిలిపెట్టబోమని పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు.

# కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు: చామకూర





## బూత్ కమిటీ సమావేశం దిగ్విజయం

నాగారం,జూన్ 7 (నేటి ప్రస్థానం) పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం నాగారం డివిజన్ పరిధిలో ల్యాండ్ మార్క్ కన్వెన్షన్ హాల్లో డివిజన్ అధ్యక్షులు తేళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ బూత్ కమిటీ సమావేశాన్నికి మల్కాజిగిరి,మేడ్చల్ ఇంచార్జ్ లు రాగిడి లక్ష్మారెడ్డి,చామకూర మహేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ బిఆర్ఎస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని, పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. పార్టీ కొరకు క్రమశిక్షణతో పని చేస్తూ సభ్యత్వ నమోదును అత్యధికంగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్ పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, నాగారం మాజీ కౌన్సిలర్లు,మాజీ వార్డు సభ్యులు,డివిజన్ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు,పలు గ్రామాల మాజీ సర్పంచులు,మాజీ ఉపసర్పంచులు, ఉద్యమకారులు,మాజీ కో-ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు గూడూరు ఆంజనేయులు గౌడ్, అన్నంరాజు శ్రీనివాస్, జగన్మోహన్ రెడ్డి,కొమి రెల్లి సుధాకర్ రెడ్డి, గూడూరు మహేష్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్, కార్యకర్తలు,పార్టీ కుటుంబ సభ్యులు అందరూ పెద్ద పాల్గొన్నారు.

# 4 గంటలు.. 90 వేల మంది

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. హైదరాబాద్--సికింద్రాబాద్ జంట నగరాలు, రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు సైతం శ్రీనృసింహస్వామిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకునేందుకు క్యూకట్టారు. దీంతో శ్రీస్వామి వారి ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, మాడ వీధులు, కొండపైన, కొండ కింద బస్టాండ్‌లు, మెట్ల మార్గం, ఘాట్ రోడ్డు, కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, క్యూకాంప్లెక్స్, శివాలయం, ప్రసాద విక్రయశాల వంటి ప్రాంతాలు భక్తుల రాకతో సందడిగా మారాయి. ధర్మ దర్శనానికి 4 గంటలకు పైగా, వీఐపీ రూ.150 టికెట్ దర్శనానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది. ఇక బ్రేక్ దర్శనానికి 30 నిమిషాలకు పైగానే సమయం పట్టింది. శ్రీస్వామి వారిని 90 వేల మంది భక్తులు దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. వివిధ పూజలతో యాదగిరీశుడికి నిత్యాదాయం రూ.73,75,642 వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు.



## సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

**మలేషియా ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్: తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మలేషియా కంపెనీలు తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేలా ముందుకు రావాలని సూచించారు. ప్రపంచ స్థాయి 'సెమీ కండక్టర్ ఎకోసిస్టం' అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని వెల్లడించారు. హైదరాబాద్‌ను చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. సెమీ కండక్టర్, ఏఐ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ వంటి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్'గా మార్చేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పెనాంగ్‌కు ఉన్న సెమీ కండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ అనుభవం తెలంగాణకు ఉపయోగపడు తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు.



## సింగరేణిలో 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు

**సగటున 50 లక్షల టన్నులు ఉండాల్సింది**

**కొన్ని ప్రాజెక్టుల్లో పనులు ఆగిపోవడంతో తగ్గిన ఉత్పత్తి**

**సింగరేణి సంస్థ వివరణ**

హైదరాబాద్: తెలంగాణకు చెందిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రస్తుతం బొగ్గు నిల్వలు, టెండర్ విధానాలు, ఆరోపణలపై వివరణ ఇచ్చింది. ప్రస్తుతం 26.51 లక్షల టన్నుల బొగ్గు మాత్రమే అందుబాటులో ఉందని సంస్థ తెలిపింది. గత 10 సంవత్సరాల్లో ఇదే అత్యల్ప స్థాయి స్టాక్‌గా నమోదు అయినట్లు స్పష్టం చేసింది. 2014-2024 మధ్య సగటు బొగ్గు నిల్వలు సుమారు 50 లక్షల టన్నులుగా ఉన్నాయని, అయితే ప్రస్తుత తగ్గుదల అసాధారణం కాదని.. ఇది సాధారణ ఉత్పత్తి, రవాణా పక్రియలో భాగమేనని సంస్థ తెలిపింది. వర్షాకాలంలో థర్మల్ విద్యుత్ అవసరాల కోసం కనీసం 30 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు అవసరమని కూడా వివరించింది. ఓవర్ బర్డెన్ పనులకు టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసినట్లు సింగరేణి స్పష్టం చేసింది. సైట్‌ను ప్రత్యక్షంగా పరిశీలించకుండా కాంట్రాక్టర్లు పనులు ఆలస్యం చేయడం, మధ్యలో నిలిపివేయడం వంటి సమస్యలు ఎదురవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. శ్రీరాంపూర్ -2 సహా కొన్ని ప్రాజెక్టుల్లో పనులు మధ్యలో ఆగిపోవడం వల్ల సంస్థకు నష్టం వాటిల్లిందని వివరించింది. ఈ కారణంగా మే 2025 నుంచి సైట్ విజిట్ సర్టిఫికేట్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. మెడికల్ బోర్డు నియామకాల్లో అక్రమాల ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ విచారణ కొనసాగుతోందని సంస్థ తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు అరెస్టులు జరిగినట్లు, సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. అలాగే విజిలెన్స్ విభాగం కూడా అంతర్గత విచారణను కొనసాగిస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం పేర్కొంది. మొత్తం వ్యవహారంపై పూర్తి పారదర్శకతతో చర్యలు తీసుకుంటున్నామని సంస్థ స్పష్టం చేసింది.



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



## ప్రభాస్ స్పిరిట్ వాయిదా.. మేకర్స్ క్లారిటీ..!

యానిమల్ బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తోన్న యాక్షన్ మూవీ స్పిరిట్. ఈ చిత్రంలో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో వస్తోన్న మూవీపై అభిమానుల్లో భారీ అంచనలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అయితే కొద్ది రోజులుగా ఈ మూవీ వాయిదా పడనుందని వార్తలొచ్చాయి. షెడ్యూల్‌లో మార్పుల వల్ల పోస్ట్‌పోన్ కానుందని టాక్ వినిపించింది. ఈ నేపథ్యంలోనే స్పిరిట్ మేకర్స్ స్పందించారు. ఈ చిత్రాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని వెల్లడించారు. ముందుగా చెప్పినట్లుగానే వచ్చే ఏడాది మార్చి 5న విడుదలవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో ప్రభాస్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై పాన్ వరల్డ్ రేంజ్‌లో తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీని ఎనిమిది భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఇందులో వివేక్ ఒబెరాయ్, ఐశ్వర్య దేశాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## జాన్వీ, శిఖర్ పహారియా పెళ్లి చేసుకోబోతున్నారంటూ ..

ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్, వ్యాపారవేత్త శిఖర్ పహారియాల పెళ్లిపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి నిర్మాత బోనీ కపూర్ తెరదించారు. జాన్వీ ప్రస్తుతం పెళ్లి చేసుకునే ఉద్దేశంలో లేదని, వస్తున్న వార్తలన్నీ పుకార్లేనని ఆయన తేల్చి చెప్పారు. వీరిద్దరూ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో లేదా తిరుమల శ్రీవారి సన్నిధిలో వివాహం చేసుకోబోతున్నారంటూ కొంత కాలంగా నెట్టింట పెద్ద ఎత్తున వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఈ తరుణంలో బోనీ కపూర్ ఇచ్చిన క్లారిటీతో ఈ పుకార్లకు ప్రస్తుతానికి బ్రేక్ పడినట్లయింది. వ్యక్తిగత విషయాలను పక్కన పెడితే, జాన్వీ కపూర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో ఆమె బిజీగా గడుపుతున్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన ఆమె నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది'పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా 2026 జూన్ నెలలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. శిఖర్ పహారియాతో తనకున్న బంధం గురించి గతంలో మాట్లాడిన జాన్వీ, అతని ఉనికి తనకు ఎంతో ధైర్యాన్ని మరియు భద్రతను ఇస్తుందని ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఆమె తన పూర్తి దృష్టిని సినిమాలపైనే కేంద్రీకరించినట్లు ఆమె తండ్రి మాటలను బట్టి అర్థమవుతోంది.





## మా ఇంటి బంగారం వాయిదా.. కారణమిదే..!

టాలీవుడ్ హీరోయిన్ సమంత ప్రస్తుతం మా ఇంటి బంగారం మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకు నందిని రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీని సామ్ సొంత బ్యానర్‌లో నిర్మించారు. ఇ?ప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం మే 15న విడుదల కానుందని ప్రకటించారు.ఈ సినిమాలో సమంత గృహిణి పాత్రలో కనిపించనుంది. ఇటీవలే రిలీజ్ చేసిన టీజర్‌లో యాక్షన్ సన్నివేశాల్లోనూ సామ్ అదరగొట్టేసినట్లు తెలుస్తోంది.

జూన్‌కు వాయిదా..: అయితే గత కొద్ది రోజులుగా ఈ సినిమా వాయిదా పడనుందని వార్తలొచ్చాయి. ముందుగా ఊహించినట్లుగానే మా ఇంటి బంగారాన్ని పోస్ట్‌పోన్ చేశారు. ఈ మూవీని ఏకంగా నెల రోజుల పాటు వాయిదా వేశారు. వచ్చేనెల అంటే జూన్ 19న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తుండడంతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారు.



## తుది దశలో 'ఆదర్శ కుటుంబం'

వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం'. 'హౌస్ నం 47' ఉపశీర్షిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. వినోదాత్మక అంశాల మేళవింపుతో క్రైమ్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకున్నట్లు తెలిసింది. ఇటీవలే క్లైమాక్స్‌లోని పోరాట ఘట్టాలను చిత్రీకరించారని, ఇందులో చిత్ర ప్రధాన తారాగణం పాల్గొన్నదని తెలిసింది. ఇంకా కొంత టాకీపార్ట్ మాత్రమే మిగిలి ఉందని, త్వరలో షూటింగ్ మొత్తం పూర్తవుతుందని సమాచారం. ఈ సినిమాలో నారా రోహిత్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. దర్శకుడు త్రివిక్రమ్ తనదైన శైలి హాస్యం, కుటుంబ భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిసింది.



## సుకుమార్‌కు కథ చెప్పడం రాదు ..

### జగ్గుభాయ్ కామెంట్స్ వైరల్

తెలుగు సినీ పరిశ్రమలో హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటుడు జగపతిబాబు మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆయన కీలక పాత్రలో నటించిన గోదారి గట్టుపైన చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో జరిగిన మూవీ ప్రమోషన్స్‌లో దర్శకుడు సుకుమార్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఫిలిం నగర్‌లో చర్చనీయాంశంగా మారాయి. మే 8న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న జగపతిబాబు.. సుకుమార్ కథ చెప్పే స్టైల్ గురించి సరదాగా ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సుకుమార్‌కు అసలు కథ చెప్పడం రాదు.. ఈ విషయం అతడే ఒప్పుకుంటాడు అంటూ నవ్వులు పూయించారు. నాన్నకు ప్రేమతో సినిమా సమయంలో సుకుమార్ తనకు కథ చెప్పడానికి ప్రయత్నించాడని, కానీ చివరకు విసిగి "సార్.. ఇవన్నీ కాదు, మీరు చేసేయండి" అన్నాడని జగపతిబాబు గుర్తుచేసుకున్నారు. దర్శకుడిపై నమ్మకంతో తాను కూడా వెంటనే ఓకే చెప్పేశానని తెలిపారు. అలాగే రంగస్థలం కథ చెప్పిన సందర్భాన్ని కూడా ఆయన సరదాగా వివరించారు. ఆ సినిమా కథ చెప్పడానికి ముందు సుకుమార్ గంటన్నర యోగా చేసి వచ్చాడు. వచ్చాక కూడా 'సార్.. ప్రెసిడెంట్ సార్.. చొక్కా ఉండదు సార్.. చుట్ట ఉంటుంది సార్.. బావుంటుంది సార్' అన్నాడు. నేను వెంటనే కథ ఓకే.. డేట్స్ ఎప్పుడు చెప్పు అన్నాను అంటూ చెప్పుకొచ్చారు. జగపతిబాబు వ్యాఖ్యలతో అక్కడున్నవారంతా నవ్వుల్లో మునిగిపోయారు.

## సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నితిన్ కొత్త ప్రాజెక్ట్!



యంగ్ హీరో నితిన్ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై రూపొందుతున్న తాజా చిత్రం నేడు అత్యంత వైభవంగా ప్రారంభమైంది. పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైన ఈ చిత్ర ప్రారంభోత్సవానికి చిత్ర యూనిట్ సభ్యులు హాజరై సందడి చేశారు. ఈ సినిమా ద్వారా సోము నర్రి దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతుండగా, 'అశోకవనంలో అర్జున కళ్యాణం' ఫేమ్ రితికా నాయక్ నితిన్ సరసన కథానాయికగా నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఇతర పనులు పూర్తి చేసుకుని, మే రెండో వారం నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది. వరుస విజయాలతో జోరు మీదున్న సితార సంస్థ ఈ సినిమాతో నితిన్‌కు ఒక భారీ కమర్షియల్ సక్సెస్‌ను అందించేందుకు సిద్ధమైంది. త్వరలోనే ఈ చిత్ర టైటిల్ మరియు పూర్తి నటీనటుల వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/